'ఉపాధి'కి ప్రణాళికలు సిద్ధం చేయాలి

మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ బాల్‌రాజ్

జహీరాబాద్, అక్టోబర్ 15: గ్రామీణ ప్రాంతాల్లో వలసలు అరికట్టి, కూలీలకు పని కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద అభివృద్ధి పనులకు గ్రామాల వారీగా ప్రణాళిలు సిద్ధం చేయాలని డీఆర్‌డీఏ అడిషన్ పీడీ బాల్‌రాజ్ సూచించారు. మంగళవారం జహీరాబాద్ పట్టణంలోని మండల అభివృద్ధి కార్యాలయంలో జహీరాబాద్ నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన ఉపాధి హామీ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి వ్యవసాయ అనుబంధ రంగాలతోపాటు ఇతర ప్రాధాన్య రంగాలతో కూలీలకు పనులు కల్పించడానికి పనుల ప్రతిపాదనల జాబితాలను సిద్ధం చేయాలన్నారు. నియోజకవర్గంలో గ్రామాల వారీగా గ్రామ సభలు నిర్వహించి నవంబర్ 30లోగా ప్రణాళికలు సిద్ధం చేసి అందజేయాలని ఆదేశించారు. సమావేశంలో ఫ్లాంటేషన్ మేనేజర్ మాణికుమార్, ఆయా మండలాలకు చెందిన ఏపీఓ రంగారావు, అశోక్‌కుమార్, రాజ్‌కుమార్, సునందరావు, గణేశ్, రమేశ్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

విద్యార్థులను సిల్వర్ మెడల్‌తో సత్కరిస్తున్న మండల అభివృద్ధి అధికారి రాజశేఖర్

జహీరాబాద్, అక్టోబర్ 15: విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని న్యాల్‌కల్ మండల అభివృద్ధి అధికారి రాజశేఖర్ అన్నారు. మంగళవారం న్యాల్‌కల్ మండలంలోని మిర్జాపూర్(బి) జడ్పీ పాఠశాలలో 2023-24 విద్య సంవత్సరంలో పదో తరగతి వార్షిక పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు మహేశ్వరి, భానుప్రసాద్, ప్రతిభ, భవానీలకు పాఠశాల ఫిజికల్ సైన్స్ ఎస్ఏ ఉపాధ్యాయుడు శ్రీనివాస్ తన తండ్రి జ్ఞాపకార్థం సిల్వర్ మెడల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాగా చదువుకొని ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. 2024-25లో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి 10 గ్రాముల బంగారం, రెండో స్థానంలో నిలిచిన విద్యార్థికి 5 గ్రాముల బంగారం ఇస్తానని ప్రకటించారు. పాఠశాల పీజీ హెచ్‌ఎం రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్రహ్మ జ్ఞాన భారతి శతకం ఆవిష్కరణ

శతకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

గుమ్మడిదల, అక్టోబర్ 15: మండల కేంద్రం గుమ్మడిదలలోని తద్వనంలో మంగళవారం తెలంగాణ రచయిత సంఘం కవులు, రచయితలు సంయుక్తంగా బ్రహ్మ జ్ఞానభారతి శతకాన్ని ఆవిష్కరించారు. సభాధ్యక్షుడిగా డాక్టర్ బెల్లంకొండ సంపత్‌కుమార్ వ్యవహరించగా గ్రంథ ఆవిష్కర్త డాక్టర్ నాళేశ్వరం శంకరం తదితరులు ప్రముఖ ఆధ్యాత్మికవేత్త జల్లిపల్లి బ్రహ్మం రచించిన బ్రహ్మ శతకంను ఆవిష్కరించారు. సమాజం-సాహిత్యం విలువలుతో కూడుకున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ జంట నగరాల ప్రముఖ రచయితలు కందుకూరి శ్రీరాములు, నాళేశ్వరం శంకరం, కందాళై రాఘవాచార్యులు, బెల్లంకొండ సంపత్‌కుమార్, గుండెల్లి ఇస్తారి, బక్కారెడ్డి, నక్క హరికృష్ణ, దేవనపల్లి వీణావాణి, కె.రుక్మిణి, అలుగోళ్ల చంద్రమోహన్, రాగుల సుధాకర్, పోతన జ్యోతి, గంగ కాశీనాథ్, శ్రీరంగం శ్రీశైలం, జల్లిపల్లి బ్రహ్మం, మోతీగిరి కవిత, సత్యనారాయణ, రెడ్డిపల్లి వెంకటేశం, మొగిలిమాల పాల్గొన్నారు.

ఆలుగడ్డ సాగుపై రైతులకు అవగాహన

ఆలుగడ్డ సాగుపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త రహుల్ విశ్వకర్మ

జహీరాబాద్, అక్టోబర్ 15: సరైన యాజమాన్య పద్ధతులతో ఆలుగడ్డ పంట దిగుబడిని పెంచవచ్చని సంగుపేట్ ఏరువాక కేంద్రం సమన్వయ కర్త, శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ అన్నారు. మంగళవారం జహీరాబాద్ మండలంలోని రాయిపల్లి, హుగ్గెల్లిలో ఆలుగడ్డ సాగు చేసే రైతులకు సమగ్ర యాజమాన్య పద్ధతులు, చీడపురుగుల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ఆలు సాగు చేసే సమయంలో విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలన్నారు. రైతులు సాగు చేసిన ఆలుగడ్డ పంటకు ఆకులు వదిలిపోయినట్టు అక్కడక్కడ గుర్తించినట్లు తెలిపారు. దీంతో ఆలుగడ్డ దుంప పరిమాణం తగ్గిపోయే అవకాశం ఉంటుందన్నారు. జహీరాబాద్, మొగుడంపల్లి ఏవోలు లావణ్య, వినోద్‌కుమార్, ఏఈవో ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు బస్వాపూర్‌కు మంత్రి రాక

పుల్కల్, అక్టోబర్ 15: మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామ శివారులో ఏర్పటు చేయనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్ కాంప్లెక్స్ భవన నిర్మాణ స్థలానికి భూమిపూజకు మంత్రి దామోదర రాజనర్సింహ హాజరవుతారని అందోల్ ఆర్డీవో పాండు తెలిపారు. బస్వాపూర్ శివారులోని 417 సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమి 33 ఎకరాలు ఉందని గుర్తించామన్నారు. అందులో 25 ఎకరాలు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణానికి స్థలాన్ని చూడాలని మంత్రి ఆదేశాలు జారీ చేయడంతో మంగళవారం భూమిని చదును చేయించామని తహసీల్దార్ కృష్ణ వెల్లడించారు. నేడు మంత్రి భూమిపూజ చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఈఈ రవీందర్, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్ పాల్గొన్నారు.

మాజీ మంత్రి హరీశ్‌రావుకు నాయకుల దసరా శుభాకాంక్షలు

హత్నూర, అక్టోబర్ 15: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుకు మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లి దసరా శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్‌ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శివశంకర్‌రావు, అజ్జు, సురేశ్‌గౌడ్, సౌకత్, అశ్వక్, అస్లాం తదితరులు

ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అపర్ణ శివరాజ్ పాటిల్

అభివృద్ధికి నిధులివ్వాలి

సదాశివపేట, అక్టోబర్ 15: సదాశివపేట అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అపర్ణ శివరాజ్‌పాటిల్, వైస్ చైర్మన్ చింతా గోపాల్ కోరారు. మంగళవారం మెదక్ ఎంపీ రఘునందన్ రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పేట అండర్ డ్రైనేజీ కోసం రూ.2 కోట్ల 33 లక్షలు మంజూరు చేయిస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల మాణిక్‌రావు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే చెల్లించాలి

జహీరాబాద్‌లో ధర్నా చేస్తున్న ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు, విద్యార్థులు

జహీరాబాద్, అక్టోబర్ 15: విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే చెల్లించాలని జహీరాబాద్ పట్టణంలోని ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణానికి చెందిన ఆచార్య, జాగృతి, వశిష్ట డిగ్రీ కళాశాలలకు చెందిన యాజమాన్య సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు కలిసి పట్టణంలోని ప్రధాన రోడ్డుపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ అవరణలోని రోడ్డు మార్గంలో ధర్నా, రాస్తారోకో చేపట్టడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా ఆయా కళాశాలలకు చెందిన యాజమాన్యాల ప్రతినిధులు, అధ్యాపకులు మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో చెల్లించకపోవడంతో కళాశాల పరిస్థితి అధ్వానంగా మారిందన్నారు. ప్రభుత్వం వెంటనే కళాశాలలకు బకాయిపడ్డ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను చెల్లించాలని, లేని పక్షం లో కళాశాలలను బంద్ చేసి నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సన్న బియ్యం చూపి దొడ్డువి విక్రయం

నాసిరకం దొడ్డు బియ్యాన్ని చూపుతున్న బాధితుడు బాలయ్య

హత్నూర, అక్టోబర్ 15: సన్న బియ్యం శాంపిల్ చూపి దొడ్డు బియ్యం విక్రయించిన ఘటన హత్నూరలో మంగళవారం చోటుచేసుకుంది. హత్నూరకు చెందిన బాధితుడు పొట్లగల బాలయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం సాయంత్రం ఓవ్యక్తి గ్రామాల్లో తిరుగుతూ నంబర్‌వన్ కర్నూల్ సన్నబియ్యం అమ్ముతున్నామని నమ్మించి 25 కిలోల సన్నబియ్యం బస్తా శాంపిల్ చూపించాడు. క్వింటాలుకు రూ.5,600 చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపాడు. గ్రామంలో ఓచోట డీసీఎం నిలిపి ఆర్డర్లు సేకరిస్తున్నట్లు నమ్మబలికాడు. తనకు క్వింటా 25 కిలోల కావాలని చెప్పడంతో వెంటనే స్కూటీపై 25 కిలోల చొప్పున ఐదు బస్తాలు తెచ్చి ఇచ్చాడు. మొత్తం రూ.6,300 తీసుకొని అక్కడి నుంచి వెళ్లిపోయాడు. మంగళవారం ఉదయం బస్తా తెరిచి చూసేసరికి నాసిరకం దొడ్డుబియ్యం ఉండటంతో మోసపోయినట్లు గుర్తించాడు. అంతేకాకుండా ఒక్కో బస్తా 20 కిలోలు మాత్రమే ఉండటంతో ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రజలను నమ్మించి మోసంచేస్తున్న ఇలాంటి వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలని వాపోయాడు.

వ్యవసాయంలో మహిళల పాత్ర ఎనలేనిది

మాట్లాడుతున్న శాస్త్రవేత్త వరప్రసాద్

జహీరాబాద్, అక్టోబర్ 15: వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర ఎనలేనిదని జహీరాబాద్ లోని పస్తాపూర్ డీడీఎస్-కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వరప్రసాద్ అన్నారు. మంగళవారం జహీరాబాద్ పట్టణంలోని డీడీఎస్-కేవీకే కార్యాలయంలో మహిళా కిసాన్ దివాస్‌ను పురస్కరించుకొని విజయవాడకు చెందిన లయోల కళాశాలకు చెందిన విద్యార్థులు వ్యవసాయ సాంకేతిక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగంలో విశేష కృషి చేసిన మహిళా రైతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ మౌనిక, ఫాతిమ, విజయలక్ష్మి, శైలజ, సాయి ప్రియాంక, కైలాష్, జహీరాబాద్ మండల వ్యవసాయాధికారి లావణ్య పాల్గొన్నారు.

ప్రేమాభిమానాలకు ప్రతీక దసరా

దుర్గామాతకు పూజలు చేసిన బార్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, న్యాయవాదులు

సంగారెడ్డి, అక్టోబర్ 15: విజయదశమిని పురస్కరించుకొని దుర్గామాతను పూజించి అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహించి దసరా వేడుకలు ఘనంగా జరుపుకోవడమే విజయదశమి అని బార్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని బార్ అసోసియేషన్‌లో దుర్గామాతను పూజించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయదశమి అంటే ప్రజలందరూ కలిసి మెలిసి చేసుకునే పండుగ అని, ప్రేమాభిమానాలకు దసరా వేడుకలు ప్రతీకగా నిలుస్తాయన్నారు.

గ్రామ సభలో సమస్యల ఏకరువు

గ్రామ సభలో మాట్లాడుతున్న అధికారులు

నారాయణఖేడ్, అక్టోబర్ 15: కలుషిత నీరు తాగి ఇద్దరు మృతి చెందగా వంద మంది వరకు అస్వస్థతకు గురైన సంజీవరావ్‌పేట్ గ్రామంలో మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. డీఎల్పీవో సంజీవ్‌రావు, తహసీల్దార్ భాస్కర్, ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఈఈ ఫణివర్మ, ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుభాష్‌లు గ్రామ సభలో పాల్గొనగా గ్రామస్తులు పలు సమస్యలను అధికారుల ముందు ఏకరువు పెట్టారు. గ్రామంలో పలు చోట్ల పైప్ లైన్ లీకేజీలు ఉండడంతోపాటు మురికి కాల్వలు శుభ్రం చేయకపోవడంతో పారిశుధ్య సమస్యలు నెలకొన్నాయన్నారు. వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, పందులు, కుక్కల బెడదను నివారించాలని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అధికారులు స్పందిస్తూ ఇప్పటికే పైప్ లైన్ లీకేజీ పనులు ప్రారంభించామని, పారిశుధ్యం, వీధి దీపాలను ఏర్పాటు చేసే పనులు సైతం ముమ్మరం చేస్తామన్నారు. పందుల తరలింపు విషయంలో వాటి యజమానులతో చర్చించగా తమకు కొంత సమయమివ్వాలని వారు కోరారన్నారు. ప్రస్తుతం గ్రామంలో మిషన్ భగీరథ నీటి సరఫరా జరుగుతున్నదని ఎలాంటి సమస్య రాకుండా చూస్తామని భరోసా కల్పించారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ

ముంగి చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ హనుమంతు, ఎస్ఐలు

జహీరాబాద్, అక్టోబర్ 15: ఎస్పీ చెన్నూరి రూపేశ్ ఆదేశాల మేరకు మంగళవారం న్యాల్‌కల్ మండలంలోని ముంగి చౌరస్తాలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హనుమంతు ఆధ్వర్యంలో హద్నూర్, రాయికోడ్, ఝరాసంగం పోలీస్‌స్టేషన్‌కు చెందిన పోలీసులతో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. గంజాయి, మత్తు పదార్థాలు, సారా, ఇతర ప్రాంతాల నుంచి అక్రమ మద్యం, గుట్కా తరలింపు కాకుండా తనిఖీలు చేశారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. లైసెన్స్, ఇన్సూరెన్స్ తదితర పత్రాలను పరిశీలించారు. రికార్డులు లేని వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో హద్నూర్, రాయికోడ్, ఝరాసంగం ఎస్ఐలు రామానాయుడు, నారాయణ, నరేశ్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

రోడ్డు పక్కన పోగైన చెత్తను తొలిగిస్తున్న మున్సిపల్ కార్మికులు

బొల్లారం, అక్టోబర్ 15: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎంపీటీసీ రత్నం పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్‌ను కోరారు. వార్డులో రోడ్ల పక్కన పోగైన చెత్తాచెదారాన్ని తొలిగించాలని స్థానికులు కోరగా వెంటనే జేసీబీ సహాయంతో మట్టి కుప్పలను చదును చేశారు. వార్డు సమస్యల పరిష్కారానికి ముందుంటామన్నారు. వార్డు శుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో స్థానికులు వీరేశం, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

వివిన్ డ్రగ్స్ నుంచి శాంపిల్స్ సేకరణ

జిన్నారం, అక్టోబర్ 15: గడ్డపోతారం పారిశ్రామికవాడలోని వివిన్ డ్రగ్స్ పరిశ్రమ నుంచి పీసీబీ అధికారులు మంగళవారం శాంపిల్స్ సేకరించారు. పరిశ్రమ నుంచి పరిశ్రమ వ్యర్థాలు బయటకు రావడంతో గ్రామస్తులు పీసీబీ అధికారులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పీసీబీ ఎనలిస్ట్ రవీందర్ పరిశ్రమ లోపల, బయట శాంపిల్స్ సేకరించారు. ఇటీవల కురిసిన వర్షాలకు పరిశ్రమ నుంచి బయటకు రసాయన వ్యర్థాలు ఉబికి వస్తున్నాయని గ్రామస్తులు తెలిపారు. పరిశ్రమల నుంచి రసాయన వ్యర్థాలు బయటకు వస్తున్న, విష వాయువులు వెదజల్లుతున్న తీరుపై పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేస్తే శాంపిల్స్ సేకరణ పేరుతో రోజులు గడుపుతున్నారని స్థానికులు అసహనం వ్యక్తం చేశారు. రసాయన వ్యర్థాలు వదులుతున్న పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మంచి నీటి సహాయకులకు శిక్షణ

కొండాపూర్, అక్టోబర్ 15: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం గ్రామ మంచినీటి సహాయకులకు శిక్షణ ఇచ్చారు. మిషన్ భగీరథ ఈఈ షేక్ పాషా ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. మొదటి రోజు మంగళశారం సింగిల్, త్రీ పేస్ మోటార్ల రిపేర్ నేర్పించారు. రెండో రోజు హ్యాండ్‌పంప్ ఎలా రిపేర్, మూడో రోజు పైప్ జాయింట్లు కొట్టడం, నల్లా కలెక్షన్ ఇవ్వడంపై అవగాహన కల్పిస్తామన్నారు. నాలుగో రోజు నీటి నాణ్యత తెలుసుకోవడానికి చేసే పరీక్షలపై వివరిస్తామన్నారు. శిక్షణలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. ఏఈ రవికుమార్, డీఈఈ సుచరిత, ఈఈ షేక్ పాషా, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, ల్యాబ్ అసిస్టెంట్ చిరంజీవి, పండరి, కొండాపూర్, సదాశివపేట వాటర్ మ్యాన్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై ఆరా

బొల్లారం, అక్టోబర్ 15: అభివృద్ధి పనులను నాణ్యతగా చేపడుతూ సకాలంలో పూర్తి చేయాలని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ కోలన్ బాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని వైఎస్సార్ కాలనీలో పర్యటించి నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. సకాలంలో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను కోరారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానికులు రఘు, వీరారెడ్డి, కాంట్రాక్టర్, తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడికి నివాళి

లింగమయ్య గౌడ్‌కు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

అందోల్, అక్టోబర్ 15: స్వాతంత్ర్య సమరయోధుడు స్వర్గీయ లింగమయ్య గౌడ్‌కి మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ మంగళవారం నివాళులర్పించారు. జోగిపేటలోని ఆయన నివాసానికి వెళ్లి నివాళులు అర్పించి, లింగమయ్య గౌడ్ సేవలను కొనియడారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు చాపల వెంకటేశం, సార శ్రీధర్, ఖజాపాషా, వినయ్ కుమార్‌గౌడ్ ఉన్నారు.

ఇందిరమ్మ కమిటీలను రద్దు చేయాలి

ఝరాసంగం: ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జహీరాబాద్/ఝరాసంగం, అక్టోబర్ 15: ప్రజలకు ఎలాంటి సమాచారం లేకుండా గ్రామ సభలు నిర్వహించకుండా అధికారులు ఏకపక్షంగా ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కమిటీలను వెంటనే రద్దు చేయాలని మొగుడంపల్లి, ఝరాసంగం మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, తాజా మాజీ సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయా మండలాల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాల్లో ఎంపీడీవోలకు ఇందిరమ్మ కమిటీపై బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుట్టుచప్పుడు కాకుండా అధికారులు ఏకపక్షంగా కమిటీలు ఏర్పాటు చేయడం సరికాదన్నారు.

మార్గదర్శకాలకు తూట్లు పొడుస్తున్నారు

సంగారెడ్డి, అక్టోబర్ 15: ప్రభుత్వ పథకాల ఎంపికకు అధికారులు వేస్తున్న ఇందిరమ్మ కమిటీల్లో మార్గదర్శకాలు పాటించడం లేదని ఎంపీడీవో యాదగిరిరెడ్డికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చక్రపాణి వినతిపత్రం అందజేశారు. మంగళవారం ఎంపీడీవోను కలిసి కమిటీల ఏర్పాటులో నిబంధనలు పాటించేలా చూడాలని కోరారు. కాంగ్రెస్‌కు అనుకూలమైన వారిని మాత్రమే కమిటీల్లో నమోదు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మాజీ జడ్పీటీసీ మనోహర్‌గౌడ్, నాగరాజ్‌గౌడ్ ఉన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ రూపేశ్

డీఎస్పీ కార్యాలయం తనిఖీ

పటాన్‌చెరు, అక్టోబర్ 15: పటాన్‌చెరు డీఎస్పీ కార్యాలయాన్ని మంగళవారం అదనపు ఎస్పీ సంజీవరావుతో కలిసి ఎస్పీ చెన్నూరి రూపేశ్ తనిఖీ చేశారు. తనిఖీకి వచ్చిన ఎస్పీకి పోలీసులు గౌరవవందనం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ పలు రికార్డులను పరిశీలించారు. గంజాయి, పాన్, గుట్కా మసాల, అక్రమ గ్యాస్ రిఫిల్లింగ్, మాదకద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదం మోపాలని సూచించారు. పారిశ్రామికవాడలపై నిఘా పెంచాలని, ట్రాఫిక్ సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

తనికెళ్ల భరణికి 'సౌందర్యలహరి' అందజేత

గుమ్మడిదల, అక్టోబర్ 15: తెలంగాణ సారస్వత పరిషత్ హైదరాబాద్‌లో జరిగిన సాహిత్య కార్యక్రమంలో ప్రముఖ నటుడు తనికెళ్ల భరణికి సౌందర్యలహరి కావ్యాన్ని అందజేశారు. మండలంలోని బొంతపల్లి జిల్లా పరిషత్‌లో తెలుగు పండిత్‌గా విధులు నిర్వహిస్తున్న కవి, రచయితలు పోతన జ్యోతి, డాక్టర్ వేముల సత్యనారాయణ రచించిన సౌందర్యలహరి కావ్యాన్ని నటుడు తనికెళ్ల భరణికి అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన రచయితలను అభినందించినట్లు చెప్పారు.

మునిపల్లి ఎంపీడీవోపై చర్యలు తీసుకోవాలి

మునిపల్లి, అక్టోబర్ 15: ప్రభుత్వ పథకాలను అర్హులైన వారికి అందించకుండా, కేవలం కాంగ్రెస్‌కు చెందిన నాయకులకు ఇస్తామని చెప్పడం, ప్రభుత్వ అధికారిగా ఉండి రాజకీయ నాయకుడిగా మాట్లాడుతున్న మునిపల్లి ఎంపీడీవోపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వల్లూరు క్రాంతికి అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ వాట్సాప్‌ద్వారా వినతిపత్రం పంపించారు. అధికారి హోదా మర్చిపోయి రాజకీయ నాయకుడిలా మారిన మునిపల్లి ఎంపీడీవోపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. మండల కేంద్రమైన మునిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎలాంటి నోటీసులు వేయకుండా ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు గుట్టుచప్పుడు కాకుండా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. అందోల్ నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో ఎలాంటి ప్రొటోకాల్ లేనివారు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పలు పథకాలకు సంబంధించి చెక్కులు పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ క్రాంతి దృష్టికి తీసుకెళ్లారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

హత్నూర, అక్టోబర్ 15: మండల పరిధిలోని కాసాల గ్రామంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం మంగళవారం ఘనంగా కొనసాగింది. ఉదయం దుర్గామాత ఆలయం వద్ద గోపూజ, మండప దేవతా హోమం, మూలమంత్ర హోమాలు, ప్రదోషపూజ, దీపారాధన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయం వద్ద ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం పెద్ద ఎత్తున నిర్వహించగా భక్తులు పాల్గొన్నారు. బుధవారం దుర్గామాత, ఊరడమ్మ దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

సంగారెడ్డి, అక్టోబర్ 15: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటానికి సిద్ధం కావాలని, ప్రజల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ దవాఖానలపై చర్యలు తీసుకోవాలని, టెస్టుల పేరుతో దోపిడీ చేస్తున్న స్కానింగ్ కేంద్రాలపై చర్యలు తీసుకోవాలని సీపీఎం ఏరియా కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో సంగారెడ్డి ఏరియా రెండో మహసభ, స్థానిక కామ్రేడ్ బుద్దదేవ్ భట్టాచార్యనగర్, బాబానగర్‌లో మహసభ నిర్వహించారు. ఈ మహసభలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. కార్మికులకు కనీస వేతనాలు రూ.26వేలు ఇవ్వాలని డిమాండడ్ చేశారు. పట్టణంలో ఈఎస్ఐ దవాఖాన ఏర్పాటు చేయాలని కోరారు. పేదలందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, రాజీవ్ గృహకల్ప లబ్ధిదారులకు ఇల్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బొల్లారం, అక్టోబర్ 15: బొల్లారం పారిశ్రామిక వాడలోని సబ్ స్టేషన్ -3లో విద్యుత్ మరమ్మతుల కారణంగా ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ అశోక్‌రావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. గృహ వినియోగదారులు, పారిశ్రామికవేత్తలు విద్యుత్ అంతరాయానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఏపీజే అబ్దుల్ కలాంకు ఘన నివాళి

పటాన్‌చెరు: ఏపీజే అబ్దుల్ కలాంకు విద్యార్థులతో కలిసి నివాళులర్పిస్తున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, అక్టోబర్ 15: దివంగత రాష్ట్రపతి, మిసైల్‌మెన్ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పటాన్‌చెరులో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆయన కాంస్య విగ్రహానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏపీజే అబ్దుల్ కలాం సేవలను గుర్తుచేశారు. అత్యంత పేద కుటుంబంలో పుట్టిన అబ్దుల్ కలాం చక్కగా చదివి జీవితంలో ఒక్కో మెట్టు ఎక్కారన్నారు. శాస్త్రవేత్తగా మిసైల్స్ తయారు చేసి దేశ రక్షణ రంగాన్ని బలోపేతం చేశారన్నారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, వంగరి అశోక్, సురేశ్, గూడెం మధుసూదన్‌రెడ్డి, వెంకటేశ్, అజ్మత్, రుద్రారం శంకర్ పాల్గొన్నారు.

నారాయణఖేడ్‌లో..

నారాయణఖేడ్, అక్టోబర్ 15: నారాయణఖేడ్ ఆక్సిజన్ పార్కు వద్ద మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్‌కు మాజీ మున్సిపల్ చైర్మన్ రుబీనానజీబ్, మాజీ వైస్ చైర్మన్ పరశురాములు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తనయుడు అభిషేక్ శెట్కార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నగేశ్, బీఆర్ఎస్‌వీ అధ్యక్షుడు తుర్కపల్లి అంజాగౌడ్, కుర్మ సంఘం తాలూకా ఉపాధ్యక్షుడు మల్గొండ పాల్గొన్నారు.

సంగారెడ్డిలో..

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 15: మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా మంగళవారం తారా ప్రభుత్వ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగాలు, సామాజిక శాస్త్రాల విభాగాల ఆధ్వర్యంలో ప్రపంచ విద్యార్థుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. అబ్దుల్ కలాం ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

బొంతపల్లిలో రక్తదానం

గుమ్మడిదల, అక్టోబర్ 15: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం జయంతిని పురస్కరించుకొని వివేకానంద యోగా సేవా సమితి రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసింది. మంగళవారం మండలంలోని బొంతపల్లిలో నిర్వాహకుడు భిక్షపతిరెడ్డి రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రక్తదాన శిబిరంలో యువకులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గోవర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఆలేటి నవీనాశ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ నాగేందర్‌గౌడ్, రామచంద్రపురం కార్పొరేటర్ పుష్పానగేశ్‌యాదవ్, బీజేపీ నాయకులు గిద్దెరాజు, మండల అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.